

'[illegible] ఇంట్లో దూ[illegible] ఇంటి [illegible] పొడిచి చంపాడు' దీన్ని హత్య అం[illegible] న్యాయం. కాని ఈ వార్త చదవండి.

'ఓ డాక్టరు [illegible] మార్ఫియా ఇవ్వటానికి మారుగా '[illegible]' ఇవ్వగా కొన్ని క్షణాలలోనే పేషంట్ మరణం పొందాడు'—ఇది హత్య! కాని అది సామాన్యమైన హత్యకాదు, వైద్యశాస్త్ర పరిభాషలో చెప్పాలంటే ఇది 'మెడికల్ మర్డర్', వైద్యుని అచాతుర్యంవల్లనో రోగ నిర్ణయంలో పొరబడటం వల్లనో, వేరే మందులు వాడటం వల్లనో జరిగే అనాహుతం! మొత్తంమీద ఆ చావుకు వైద్యుడే కారణం. అయితే [illegible] నేరస్థుడిని శిక్షించినట్లుగా వీరిని శిక్షిందరా? శిక్షిస్తారు. కాని—డాక్టర్ చేసిన నేరం, ఖూనీకోరు చేసిన నేరంలాగా బయటపడదు' అంతే............

ఏ డాక్టర్ ఇలాంటి నేరం చేసినప్పుడు దానిని తన వృత్తి బాంధవుల ముందు చెప్పుకుని మనస్సు తేలికపరుచుకోవపోతే మనస్సుకు శాంతి ఉండదు.

ఎప్పటికప్పుడు తాము చేస్తున్న మెడికల్ మర్డర్స్‌ను నివేదించడానికి మా నగరంలోనే డాక్టర్ల క్లబ్ ఒకటి ఉండేదని ఈ మధ్యే తెలిసింది నాకు. డా. ముఖర్జీ ఈ 'ఎక్స్‌క్లబ్' గురించి నాకు చెప్పకపోయినట్లయితే ప్రపంచంలో నేను తెలుసుకోవాల్సిన అత్యంత అమూల్యమైన విషయాల్లో ఒక విషయాన్ని తెలుసుకోని లోటు నా జీవితంలో ఎప్పటికీ మిగిలిపోయేది.

మా ఊళ్లోని ప్రసిద్ధులైన డాక్టర్లందరూ కలిసి ఈ 'ఎక్స్‌క్లబ్'ని స్థాపించారుట. ఆ సభ అక్కడి అత్యాధునికమైన హోటల్‌లోని గుప్తమైన నో గదిలో జరిగేదట. అక్కడి కార్యకలాపాలన్నీ రహస్యంగా ఉంచబడేవి. మూడు నెలలకోమారు జరిగే ఈ సభలో సభ్యులు తాము చేసిన హత్యల గురించి నివేదించే కార్యక్రమం ఉండేదిట.

నా స్నేహితుడు డా. ముఖర్జీ, వో రాత్రి విందు భోజనానికి మా ఇంటికి వచ్చినప్పుడు ఈ సంగతంతా చెప్పారు. ఇప్పుడు ఆ 'ఎక్స్‌క్లబ్' రూపుమాసిపోయిందట. చాలామంది దేశమాత పిలుపును అందుకుని మన జవాన్ల యోగక్షేమాలకోసం చైనా పాక్ సరిహద్దు ప్రాంతాలకు వెళ్లిపోయారట. మిగతావారు తమ పనుల ఒత్తిడివల్ల సభకు రాలేకపోతున్నారట. కొంతమంది ఇహలోకయాత్ర ముగించినందున 'ఎక్స్‌క్లబ్' పూర్తిగా మూతపడింది.

ఎక్స్‌క్లబ్ గురించి తెలుసుకోవాలన్న నా కుతూహలాన్ని గమనించి డా. ముఖర్జీ దాన్ని గురించిన మరికొన్ని వివరాలను చెప్పసాగారు. అందులో ఎక్స్‌క్లబ్ ఏభైమూడో అనగా ఆఖరి సమావేశం, మరింత రసవత్తరంగా ఉండని చెప్తూ ఆ సభ కార్యకలాపాలను రసవంతంగా వర్ణించసాగారు.

* * *

ఆ రోజు 'ఎక్స్‌క్లబ్' ఏభయిమూడవ సమావేశం. విందు భోజనాలవగానే అందరికన్నా వృద్ధుడైన డాక్టర్ బిపిన్ చంద్ర శహా ఆ రోజు సభకు అధ్యక్షత వహించారు.

డెబ్బై యేళ్లు దాటిన డాక్టర్ శహా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్‌గా చాలాకాలంగా సేవ చేశారు. ఆయన క్లాసులో పాఠాలు చెప్పేటప్పుడు విద్యార్థుల నుద్దేశించి 'నే నివాళ మీకు నేర్పే విద్య ఓ మూర్ఖుని మిథ్యావేదాంతమని నిర్ణయింపబడవచ్చు. ఇదే సత్యమని ఎప్పుడూ మనం చెప్పలేము. రోజులు గడుస్తున్నకొద్దీ కొత్త సంశోధనలు, కొత్త సిద్ధాంతాలు వెలుగులోకి వస్తాయి. పాత సంశోధనలు, పాత సిద్ధాంతాలు మూలపడతాయి' అని అంటూండేవారు. ఆయన మాటల్లో వినయశీలత' వైద్య విజ్ఞాన ప్రగతి పట్ల ఆయన కున్న ప్రగాఢ విశ్వాసం కనిపిస్తూండేవి.

డాక్టర్ శహా సభ నొక్కసారి కలయచూసి సభలో కొత్త మొహాన్ని చూసి, ఇలా అన్నారు. 'మిత్రులారా, ఇవ్వాళ్టి సభకు కొత్త సభ్యు లొకరిని పరిచయం చెయ్యగలుగుతున్నందుకు సంతోషిస్తున్నాను. డాక్టర్ గుప్తా ఈ క్లబ్బులో కొత్తగా సభ్యత్వం స్వీకరిస్తున్నారు. వయస్సులో చిన్నవారైనా అసాధారణ ప్రతిభాశాలి ఆయన' అని అన్నారు. సభికుల కరతాళధ్వనుల మధ్యలో డాక్టర్ శహా. డాక్టర్ గుప్తావేపు తిరిగి 'డా. గుప్తా మీరు ఈ క్లబ్బుకు కొత్త వారు గనుక మీకు ఇక్కడి ధ్యేయాలను గురించి కొద్దిగా చెప్పడం నా కర్తవ్యం. మే మందరం ఇక్కడ ఇలా కలుసుకోవటం కేవలం ఒకే ఒక్క ఉద్దేశంతో. ఇక్కడ రోగుల రోగాలను కనుక్కోము. కాని డాక్టరు చేసిన తప్పులను కనుక్కుంటాము.

'మనలో ఎవరైనా ఓ హత్య చేసివుంటే దాన్ని గురించి సభ్యులందరకు తెలియపర్చాలి. హత్య అంటే మెడికల్ మర్డర్. రోగి చికిత్స పొందుతున్నప్పుడు మరణిస్తే అది హత్య కాదు. రోగ నిర్ణయంతో పొరపడడంవల్ల; ఒక మందుకు మారుగా మరో మందు ఇవ్వటంవల్ల, ఒక ఆపరేషన్‌కు మరొక ఆపరేషన్ చెయ్యటంవల్ల రోగి మరణిస్తే అది హత్య. టెక్నికల్‌గా చెప్పాలంటే ఇది మెడికల్ మర్డర్. కాని ఈ హత్యల గురించి పోలీసులకుగాని, పత్రికలవాళ్లకుగాని రిపోర్టు చెయ్యబడదు. ఆ విషయంలో మీరు నిశ్చింతగా ఉండవచ్చు. కనుక మిస్టర్ గుప్తా, మీరు అమాయకురాలైన స్త్రీని పరలోకానికి పంపినా లేక మీ మేనమామను స్వర్గద్వారానికి ప్రయాణం కట్టించినా సభికులకు విన్నవించడానికి ఎంతమాత్రం సంకోచపడవలసిన అవసరం లేదు.'

డా. శహా 'మనమంతా మనమన క్షేత్రాలలో ప్రతిభ గలవారమే. కాని 'తప్పుచెయ్యటం మానవ సహజం' అన్న సిద్ధాంతాన్ని మరవకూడదు. మన మెంత తెలివిగలవారమైనా ఎప్పుడో ఒకప్పుడు తప్పు చెయ్యనే చేస్తాము. అలా చేసిన వారికి తమ అపరాధాన్ని నిండుమనస్సుతో బయట పెట్టటానికి అనువైన స్థానం ఇది. కనుక ఏదీ డా. కుమారస్వామీజీ, మీ 'హత్య'గురించి చెప్పండి. వినటానికి మేమంతా కుతూహల పడుతున్నాం' అని చెప్పి చిరునవ్వుతో ఆసీనులయ్యారు.

డా. కుమారస్వామి లేచి నుంచుని చెప్పసాగారు 'ఇప్పుడో నెలరోజుల క్రిందట నా నర్సింగ్ హోమ్‌లో ఒక పేషంటుకు అర్జంటుగా 'బేరియం ఎక్సరే' తియ్యాల్సి వచ్చింది. 'ఫ్లూరో స్కోప్' రూమ్‌కి పంపాను. నా అసిస్టెంట్ డా. రత్నం ఆ పేషంట్‌కు బేరియం త్రాగించి ఎక్సరే యంత్రం ముందు నిలిపారు. నేను ఆ పేషంట్ స్క్రీనింగ్ చూస్తుండగానే అతనివళ్లు బిగుసుకు పోసాగింది. రెండు నిమిషాల్లోనే ఆ వ్యక్తి రాతిలా బిగుసుకుని అక్కడికక్కడే మరణించాడు.'

సభలో గుసగుసలు మొదలయ్యాయి.

'అదెలా సాధ్యం ?' డాక్టర్ జోసెఫ్ ప్రశ్నించారు.

డా. కుమారస్వామి మెల్లగా చెప్పారు. 'పేషంటుకు బేరియం త్రాగడానికి ఇచ్చిన గ్లాసులో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పొడి వుంది. అది అతని గొంతుకలో దిగగానే గట్టిపడ సాగింది. హృదయం మీద దీని పరిణామంగా జరిగిన ఒత్తిడి వల్ల రెండు నిమిషాల్లోనే హార్ట్ ఫెయిలయింది.'

'బేరియంసల్ఫేట్ పొడి కాకుండా గ్లాసులో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ పొడి ఎలా వచ్చింది'

మలొకరి ప్రశ్న.

'తయారు చేసినవారి అశ్రద్ధ ఫలిత మయుండవచ్చు' డా. కుమారస్వామి అన్నారు.

డా. శహ మధ్యలో అందుకుని 'రోగి మీ దగ్గరకు రావటానికిముందు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తిని ఉండవచ్చుగా' అన్నారు.

డా. కుమారస్వామి 'వీల్లేదు. రోగి నాకేం కొత్తవాడు కాదు. నానర్సింగ్ హోంలో 15 రోజులనుండి ఉన్నతను. అతనికి 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' దొరికే అవకాశం లేదు.

'అతను 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' మింగాడని ఎలా తెలిసింది?'—డా. శహ ప్రశ్నించారు,

'పోస్టుమార్టం రిపోర్టులో రోగి కడుపులో 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్' ఉందని తెలియజేయబడింది' కుమారస్వామి జవాబిచ్చారు.

సభలో మళ్లీ గుసగుసలు ప్రారంభమయ్యాయి.

అంతలో డా. శహ లేచి నుంచుని 'ఇప్పుడు డా. గులాం హుస్సేన్‌గారు తమ అనుభవం చెబుతారు. కమాన్ డా. హుస్సేన్' అన్నారు.

డా. గులాం హుస్సేన్ నిలబడి తమ అనుభవాన్ని వివరించసాగారు.

# వైద్యుల వ్యాధి

'నేను కొద్దిరోజులక్రితం ఊళ్లో ని శ్రీమంతులొకరి ఇంటికి వెళ్లాను. వారి పిల్లలిద్దరు కడుపునొప్పితో బాధపడుతున్నారని ఒకసారి వచ్చి చూడమని కబురు వచ్చింది. నేను వారింటికి వెళ్లినప్పుడు రాత్రి తొమ్మిది కావొస్తోంది. ఆ రోజు ఆస్పత్రిలో చాలా రద్దీగా ఉన్నందువల్ల సాయంత్రానికల్లా నేను బాగా అలసిపోయాను. ఆ పెద్దమనిషి పిలుపును మన్నించక తప్పదు గనుక వారింటికి వెళ్లాను. ఆయన ఇద్దరు పిల్లలనూ (పది—ఎనిమిది సంవత్సరాలు) పరీక్ష చేశాను. సాధారణ పరీక్షలో ఆ కడుపు నొప్పి స్వరూపం నాకంతగా అవగాహన కాలేదు. కడుపులో వర్మ్స్ ఉండొచ్చని సందేహించి పిపరాజైన్ సిట్రేట్ త్రాగించమని, ప్రొద్దున్నే ఇద్దరికీ ఆముదం ఇమ్మని చెప్పి వెనక్కి వచ్చేశాను. మరుసటిరోజు ఉదయం సుమారు పదింటికి ఆ పిల్లలను చూడటానికి వెళ్లేసరికి పెద్ద పిల్లకు విరోచనంలో పాములు పడ్డట్టు తెలిసింది. కాని చిన్నపిల్ల పరిస్థితి విషమించింది. ఆ పిల్లను పరీక్షించినప్పుడు జ్వరం 105° డిగ్రీలు ఉంది. నాడి అతివేగంగా కొట్టుకుంటోంది.




కడుపు కర్రపలకలాగా బిగుసుకుపోయింది. కాస్సేపట్లో...' డా. హుస్సేన్ మాట తడబడింది.

'కాస్సేపట్లో ఆ పాప చనిపోయింది కదూ డాక్టర్?' డా. చౌదరి సూటిగా అడిగారు.

అవునన్నట్టు తల ఆడించారు డా. గులాం హుస్సేన్.

గెలుపు సాధించినట్టుగా చౌదరి అన్నారు 'జరిగిందింతే. డా. హుస్సేన్ రెండోపిల్ల పరిస్థితి తప్పుగా అంచనా వెయ్యటంవల్లనే ఈ అనాహుతం జరిగింది. రెండోపిల్ల కడుపులో వర్మ్స్ లేవు. నిజానికి ఆ పిల్ల 'అపెండిసైటిస్'తో బాధపడుతోంది. మన వైద్యమహాశయులు చెప్పినట్టుగా ఆముదం త్రాగినందున పేగుల్లో ఒత్తిడి ఎక్కువై రోగగ్రస్తమైన అపెండిక్స్ పగిలి చీము పేగుల్లో వ్యాపించి 'పెరిటోనైటిస్'తో పిల్ల చనిపోయింది.

సభలో కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది. డా. శహ ఆ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ అన్నారు. 'డా. రాంసింగ్ ఇప్పుడు మీ వంతు.'

డా. రాంసింగ్ సుప్రసిద్ధుడైన సర్జన్. ఏభయ్యేళ్లున్నా చూట్టానికి దృఢంగా ఉన్నారు. ఆయన ఆకారం—ఆయన కాలేజీలో చదువుకునే రోజుల్లో మంచి ఆటగాడన్న సంగతి తెలుపుతోంది.

ఒకసారి సభను కలయచూసి డా. రాంసింగ్ ప్రారంభించారు. 'ఈ హత్యను గురించి ఎలా వర్ణించాలో తెలియటం లేదు. బహుశ ఇది నా సర్జరీ అనుభవంలోనే వో ఆకస్మిక దుర్ఘటన అని చెప్పాలి'

డా. శహ మధ్యలో కలుగజేసుకుంటూ 'మీరు మీ స్పోర్ట్స్ ఆక్టివిటీస్‌ని తగ్గించి ఆ సమయాన్ని కూడా శస్త్ర చికిత్సా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవటానికి ఉపయోగిస్తే ఇలాటి ఆకస్మికాలు జరక్కుండా ఉంటాయేమో' అన్నారు నవ్వుతూ.

వో క్షణం సభికుల నవ్వులతో హాలు మార్మోగిపోయింది.

రాంసింగ్ మళ్లీ చెప్పసాగారు.

'రోజుకి నేను నాలుగయిదు ఆపరేషన్‌లు చెయ్యాల్సి వుంటుంది. శలవు రోజుల్లో

కూడా ఏదైనా 'ఎమెర్జన్సీ' ఉండనే ఉంటుంది. అలాగయినా కూడా యిన్ని యేళ్ళ నా అనుభవంలోనూ ఇలా జరగటం ఇదే మొదటిసారి.'

డా. ముఖర్జీ 'ప్రతి డాక్టరుకు మూడు నెలలకో మెడికల్ మర్డర్ చేసే అధికార మున్నపుడు ఇన్నాళ్ళ అవకాశాన్ని ఉపయోగించుకోకపోవటం మీ అసాధారణమైన సహన శక్తిని నిరూపిస్తోంది. అభినందనలు' అన్నారు నవ్వుతూ.

సభలో మరోసారి నవ్వులు ప్రతిధ్వనించాయి.

డా. శహా 'దయచేసి మీ ప్రసంగం కొనసాగించండి' అని మనవి చేశారు.

డా. రాంసింగ్ డా. శహావేపు తిరిగి 'మీకు 'అక్యూట్ కోలిసిస్టైటిస్' రోగ చిహ్నాలు తెలుసుగదా' అన్నారు.

తెలుసునన్నట్లు శహా తల ఊపారు.

డా. రాంసింగ్ 'కొన్ని రోజులక్రిందట నా సర్జికల్ నర్సింగ్ హోమ్‌లో ఒకామె చేరారు. ఆమె అడ్మిట్ అయినప్పుడు రాత్రి షుమారు ఎనిమిది గంటలయి ఉంటుంది. నేనామెను చూసినప్పుడు కడుపు కుడిభాగంలో విపరీతమైన జబ్బుతో బాధపడుతున్నారు 'గాల్‌బ్లాడర్' ఉన్నచోటులో నొక్కితే మరీ నొప్పిగా ఉందన్నారు. నొప్పి కుడివైపు భుజాస్థిదాకా (రైట్ స్కాపులా) వ్యాపించింది. ఆమె అప్పుడప్పుడూ వాంతి చేస్తోంది. జ్వరం 103 డిగ్రీలదాకా ఉంది. నా పరీక్షలో ఆమె గాల్‌బ్లాడర్ వాచినందువల్ల బాధపడుతున్నట్లనిపించింది. వెంటనే నొప్పి తగ్గటానికి ఓ ఇంజక్షన్ ఇచ్చాను, కాని ఆమె రాత్రంతా నిద్రపోలేదు. నొప్పి ఎక్కువవసాగింది. అప్పుడు నేను ఆపరేషన్ చెయ్యటమే మంచిదన్న నిశ్చయానికొచ్చాను. కాని ఆపరేషన్ చేసి 'గాల్‌బ్లాడర్' పరీక్షించినప్పుడు అక్కడ రోగ చిహ్నాలేమీ కనిపించలేదు. ఇంకో గంటలోనే ఆమె మరణించింది.

కాస్సేపు సభలో నిశ్శబ్దం తాండవించింది, ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ 'మీలో ఎవరైనా ఆమె జబ్బు ఏమిటో ఊహించగలరా?' అని ప్రశ్నించారు.

డా. జోసెఫ్ లేచి నుంచుని 'నాదగ్గరికెవరైనా కడుపునొప్పి, రొమ్మునొప్పి అని వస్తే వెంటనే అతనిగుండె సరిగ్గా పనిచేస్తోందో లేదో పరీక్షిస్తాను. అది సక్రమంగా పనిచేస్తుందని రూఢీ పర్చుకున్నాకనే నొప్పికి కారణం ఏమిటో చూస్తాను' అన్నారు.

'కరెక్ట్.' డాక్టర్ శహా, డాక్టర్ జోసెఫ్ అభిప్రాయాన్ని ఆమోదించారు. 'పోస్ట్‌మార్టంలో ఏమని రిపోర్ట్ వచ్చింది డాక్టర్ రాంసింగ్?' అని ప్రశ్నించారు.

'ఆమెకు గుండెలోని రక్తనాళంలో గడ్డ కట్టిందని తెలిసింది.'

డాక్టర్ శహా 'మా శా దా, మీరు 'కారొనరీ థ్రాంబోసిస్' కేసును పొరపాటుగా భావించి ఆపరేషన్ చెయ్యటంవల్ల ఇలా జరిగింది. మీలాటి ప్రఖ్యాత సర్జన్ ఇలా చెయ్యగలరని నే నూహించలేకపోయాను' అన్నారు.

డా. రాంసింగ్ 'నిజమే, ఇదే నా మొదటి మరియు ఆఖరి పొరపాటని మీకు భరోసా ఇస్తున్నాను. మరెప్పుడూ ఇలా జరగదు' అంటూ కూర్చున్నారు.

తరువాత డా. శహా నిలబడి సభికులనుద్దేశించి 'మిత్రులారా ఇవ్వాళ్టి మన సభకు విచ్చేసిన కొత్త సభ్యులు డా. గుప్తా వయసులో చిన్నవారైనా శస్త్రచికిత్సలో ప్రావీణ్యం గలవారు. స్వహత్యా నివేదనలో ఇప్పుడు ఆయన వంతు. అందరికన్నా చిన్నవయస్కులైన హంతకుడు డా. గుప్తాను ఆయన చేసిన నేరాన్ని సభవారికి విన్నవించాలని కోరుతున్నాను' అన్నారు.

డా. గుప్తా లేచి నుంచున్నారు. వరుసంగా అందర్ని ఒక్కసారి పరిశీలనగా చూసి నెమ్మదిగా ప్రసంగించసాగారు.

'నేను ఈ హత్యను గురించి వివరంగా చర్చించదలుచుకున్నాను. ఇలాటి సంఘటన వైద్య ప్రపంచంలోనే అరుదుగా సంభవిస్తూ ఉంటుంది. నేనిప్పుడు చెప్పబోయే విషయం ఇరవయ్యేళ్ళ హరిజన యువకునికి సంబంధించినది. అతను అతి వినయవంతుడు. ప్రతిభాశాలి. చక్కని గేయాలను రాసేవాడు. ఆ యువకుని పరిచయం నాకు వృత్తిరీత్యా కాకుండా గేయాల మూలంగానే అయ్యింది. అతని గేయాలను చదివి మెచ్చుకుంటూ అతనితో పత్ర వ్యవహారం ప్రారంభించాను. ఇలా పెంపొందింది మా స్నేహం...'

ప్రసంగం మరో దారి పట్టినందుకు సభలో గుసగుసలు బయల్దేరాయి.

డా. శహా 'ప్లీ, మీ రోగి వివరమ్యేదన్న మాట' అన్నారు.

డా. గుప్తా 'అవును. అతనో వర్గ సమానత్వం కోసం పోరాటం సాగించే కవి. సమాజంలో జరుగుతున్న అన్యాయం, అక్రమాలకు విరుద్ధంగా యుద్ధం ప్రకటిస్తున్న ధీరకవి. అతని గేయాలన్నీ సంఘంలో జరుగుతున్న అక్రమాల, అన్యాయాలకు విరుద్ధంగా ప్రయోగిస్తున్న ఆయుధాలు.'

డా. చౌదరి మధ్యలో కల్పించుకుంటూ 'డా. గుప్తా, ఇది వైద్యుల సభ, సాహిత్య సమ్మేళనం కాదు. గుర్తుంచుకోండి' అన్నారు.

డా. గుప్తా 'నిజమే, నాకా సంగతి తెలుసునండి. నేను చెప్పబోతున్నది వైద్యకీయ హత్యను గురించే. మీరు అంతలోనే తొందరపడుతున్నారు మరి' అంటూ తమ ప్రసంగం కొనసాగించారు.

'రెండు నెలలు అనారోగ్యంతో బాధపడ్డ తరువాత ఆ యువకుడు నాకు కబురు పంపాడు. అతని పరిస్థితి కళ్ళారా చూసిన నేను వెంటనే ఆస్పత్రిలో జాయిన్ చేసుకున్నాను.

ఆ యువకుని కడుపులో ఎడమవైపు భరించలేని నొప్పి వచ్చేదట. మొదట్లో డాక్టర్ని మాన్పామనుకుని నొప్పి కొద్దిగా తగ్గటంవల్ల అశ్రద్ధ చేశాడు. మళ్ళీ నొప్పి మొదలయి జ్వరం కూడా రాసాగింది. రానురాను పరిస్థితి క్షీణించసాగింది. మలవిసర్జనలో చీము, నెత్తురు పడసాగింది. ఆ స్థితిలో నేనతన్ని చూడటం జరిగింది. మలపరీక్ష చేసినపుడు పెథాలజీ రిపోర్ట్‌లో రోగాణువు లేని మలంలో చేరవని తెలిసింది. నొప్పి ఎడంవేపు గనుక అపెండిసైటిస్ కాదని తెలుస్తోంది. రోగలక్షణాలనుబట్టి పెద్దపేగులో పుండు పుట్టి బాధపడుతున్నాడనిపించి లివర్ ఎక్స్‌ట్రాక్ట్ ఇంజక్షన్, రక్తవృద్ధికి టానిక్ ఇమాన్, జెల్‌సోనాబు

పళ్ళు మాత్రలు ఇవ్వసాగాను. ప్రోటీన్ ఉన్న పదార్థాలు, పాలు ఎక్కువగా తీసుకో మని చెప్పాను. అతని దేహస్థితి ఎంత జాగ్రత్తగా చూస్తున్నా క్షీణించసాగింది. కడుపులో నొప్పికూడా ఎక్కువవసాగింది. కడుపును చేతితో ముట్టుకుంటేనే నొప్పితో కేకలు పెట్టేవాడు. నేను రెండువారాలు పడిన శ్రమంతా విఫలమయింది. ఆఖరి కారోజు అతను...మరణించాడు.'

'పోస్టుమార్టం రిపోర్టు ఏమం టుంది?' డా. రాంసింగ్ అడిగారు.

'పోస్టుమార్టం చెయ్యలేదు. కాని నేనారోగి విషయంలో తగినంత శ్రద్ధ తీసుకున్నాను. నా శక్తివంచన లేకుండా శ్రమ పడ్డాను. ఇది నిజం.'

'మీరు జబ్బును సరిగ్గా గుర్తించి చికిత్స చేశారేమో. కాదని ఎందుకను కుంటున్నారు?' డా. ముఖర్జీ అడిగారు.

'కాదు. జబ్బును గురించి నేను సరిగ్గా గ్రహించి ఉంటే నా చికిత్సవల్ల అతను ఆరోగ్యవంతుడయ్యేవాడు కదా. అలా జరగ కుండా నా చికిత్స సమయంలోనే అతను మరణించటంవల్ల నా రోగ నిర్ణయంలో పొరపాటు ఉందన్న తీర్మానానికొచ్చాను.

సభలో మళ్ళీ మౌనం రాజ్యం చేయ సాగింది.

డా. గుప్తా ఆ మౌనాన్ని ఛేదిస్తూ సభికుల నుద్దేశించి—

'ఇక్కడ ఉన్న అతిరథ మహారథుల్లో ఎవ్వరికి నా పేషంటు జబ్బేమిటో అర్థం కాలేదనుకుంటా' అన్నారు. ఆయన కళ్ళు విజయాన్ని చేపట్టినవానిలా వెలుగు తున్నాయి. 'మీ గొప్ప పాండిత్యం ఇంతేనా ఏమిటి?' అన్న సవాలు కూడా ఉందా యన కంఠంలో.

డా. శహా వెంటనే లేచి నుంచుని 'డా. గుప్తా, మీరు మొదటినుండి రోగి జబ్బు ఏమిటో గ్రహించకుండా వ్యర్థ చికిత్స చేశారు. పెద్ద పేగులో పుండు ఉన్నట్లయితే దీర్ఘకాలపు నొప్పి, జ్వరం ఉండకూడదు. కాబట్టి మీ రోగి జబ్బు అది కాదని స్పష్టమే. అతని జబ్బు ఇంకేదో అయియుంటుంది. డా. కుమార స్వామి, డా. గుప్తా చెప్పిన లక్షణాలు వేరే ఏ యే రోగాలకుంటాయో వివరిం చండి' అన్నారు.

డా. కుమారస్వామి 'రోగి కడుపు ఎడంవేపు నొప్పి అనేవాడు. నొప్పి ఒక్క సారి వచ్చి తగ్గిపోయి మళ్ళీ వచ్చిం దన్నారు. ఈ లక్షణాలు గ్యాస్టిక్ అల్సర్‌కి ఉంటాయి' అన్నారు.

డా. శహా 'ఉహూఁ. నే నొప్పుకోలేను. రోగికి జ్వరం వచ్చింది. విరోచనంలో చీము, నెత్తురు పడటం గ్యాస్టిక్ అల్సర్ లక్షణాలు కాదు' అన్నారు.

డా. ముఖర్జీ 'డా. గుప్తా, మీ రోగి ఆఖర్లో కడుపుమీద వేలుంచినా నొప్పి అని అరిచేవాడన్నారు కదూ?' అనడిగారు.

డా. గుప్తా 'అవున'న్నారు.

డా. ముఖర్జీ 'ఈ లక్షణాలు చూస్తే మీ రోగి 'పెరిటోనైటిస్' తో బాధ పడ్డాడేమో ననిపిస్తోంది. పెరిటోనైటిస్ అయినప్పుడలాటి నొప్పి వస్తుంది కదా' అన్నారు.

డా. శహా కల్పించుకుంటూ 'అవును కాని పెరిటోనైటిస్ అవటానికి ముందు పేగులో ఏదైనా బాధ ఉంటుండాలి. రోగగ్రస్తమైన పేగుల్లో చిల్లుపడి ఆ చీము కడుపులో వ్యాపించాలి. పెరిటో నైటిస్ అయితే రెండే రోజుల్లో పేగులు కుళ్ళి రోగి చావటం ఖాయం. కాని ఈ వ్యక్తి రెండు వారాలు అనారోగ్యంతో బాధపడి డాక్టర్‌కి కబురంపాడంటె అది పెరిటోనైటిస్ కానే కాదు' అని వివ రించారు.


'ఒకవేళ అపెండిక్స్ ఎడంవైపు ఉండి దానివల్ల నొప్పి వచ్చిందేమో' డా. చౌదరి తమ సందేహాన్ని వ్యక్త పరిచారు.

'వీల్లేదు. మొదటినుంచి నొప్పి ఒక్క చోటే ఉంది. ఎడంవేపు అపెండిక్స్ ఉన్న ట్లయితే నొప్పి ఒక్కచోట్నే ఉండదు. కాసేపు ఎడంవేపు కాసేపు కుడివేపు వుంటూంటుంది' అంటూ డా. కుమార స్వామి వాదించారు.

ఇదంతా చూశాక ఓ సంగతి స్పష్ట మవుతుంది. పేషంటుకు పేగుల్లో పుండు ఉన్నమాట నిస్సంశయం. కాని అది డా. గుప్తా అనుకున్నట్లుగా కొలైటిస్ పుండు కాదు. ఇక్కడో ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతుంది. పేగుల్లో పుండుపడటానికి కారణమేమిటో అని' డా. ముఖర్జీ ప్రశ్న లేవనెత్తారు.

'హాఁ! కొలైటిస్ కాకుండా మరో పుండు ఉండొచ్చన్న సంగతే తోచలేదే నాకు' డా. గుప్తా నాలుక్కరుచుకున్నారు.

అంతలో డా. సలీం హుస్సేన్ కూర్చున్న చోటులోనే ఇబ్బందిగా కద లటం గమనించి డా. శహా 'ఏమిటండీ హుస్సేన్ సాబ్, రోగనిర్ణయంలో మీకే దయినా కొత్త సంగతి తట్టిందా?' అనడిగారు.



డా. హుస్సేన్ తడబడుతూ 'అదే ఆలోచిస్తున్నా, డా. గుప్తా తమ రోగి ఇరవయ్యేళ్ల యువకుడంటున్నారు చిన్న పిల్లలయితే పిన్ను, మేకు ఇలాంటివి మింగటంవల్ల కడుపులో పుండయ్యే అవకాశం ఉండేది. కాని ఇరవయ్యేళ్ల యువకుడు...' అంటూండంగానే,

'అయితేనేం. ఇరవయ్యేళ్ల యువకుడు ఆత్మహత్యకోసం దోసెడు పిన్నులు మింగకూడదా ?' డా. కుమారస్వామి సవాల్ చేశారు.

'ఛ! ఛ! ఆ యువకుడు ఆఖరి నిమిషందాకా బ్రతుకుమీద ఆశ కలిగే ఉన్నాడు. తను బ్రతుకుతాననే నమ్మకం బలంగా ఉందతనిలో'. డా. గుప్తా దీర్ఘంగా నిట్టూర్చారు.

'ఆ రోగి మాంసాహారి అయుంటే చికన్ ఎముకతో అలాంటి గాయం అయ్యే అవకాశం ఉంది' అన్నారు డా. రాంసింగ్.

'అలా కుదరదు. 'చికన్' ఎముక చిన్న ప్రేవులదాకా అడ్డులేకుండా వెళ్ల లేదు.' డా. జోసఫ్ అలా చెప్పారు.

డా శహ లేచి నుంచుని గంభీరంగా అన్నారు, 'ఇప్పటిదాకా మనందరం డా. గుప్తాగారి కేసునుగురించి మనమంతా దీర్ఘంగా చర్చించాం. నొప్పి క్రమంగా ఎక్కువవుతూ వచ్చిందన్న అంశం పరిశీలిస్తే పేగుల్లో పుండయిందని అది తర్వాత చీము పట్టిందని తేలుతోంది. డా. గుప్తా వివరించిన అంశాలవల్ల అది కొలైటిస్ కాదని తెలుస్తోంది. ఇక ఈ రకమైన పుండు కడుపులో అవ్వాలంటే రోగి ఏదైనా చిన్నపదార్థాన్ని అకస్మాత్తుగా మింగి ఉండాలి. అది పిన్, చికన్ ఎముక కాకపోతే ఇక అద్ది...'

'చేప ఎముక కాక మరేమీ అయ్యుండదు' కొన్ని కంఠాలు ఏకంగా పలికాయి.

'కరెక్ట్' అన్నారు డా. శహ.

డా. గుప్తాగారి మొహంలోకి వింత కాంతి మెరిసి మాయమయింది. డా శహ చిరునవ్వు నవ్వుతూ డా. గుప్తా నుద్దేశించి 'డా. గుప్తా, మీరు మీ రోగి రోగనిర్ణయాన్ని గురించి ఇక్కడి అతిరథ, మహారథులను సవాల్ చేశారు. ఇప్పుడా అతిరథ, మహారథులవల్ల మీకు తగిన సమాధానం దొరికినట్లే కదా' అంటూ

# వైద్యుల వ్యాధి

మళ్లీ సభ నుద్దేశించి 'ఇక్కడ చేరిన వైద్యులందరి ఏకగ్రీవమైన నిర్ణయం, డా. గుప్తా తమ రోగికి కొలైటిస్ అల్సర్ ఉందన్న భావనతో చికిత్సచేసి చంపారు దానికి మారుగా వారు చిన్న ఆపరేషన్ చేసి పేగుల్లో చిక్కుకున్న చిన్నచేప ఎముకను తీసి ఉంటే రోగి బ్రతికేవాడేమో...'

డా. శహ మాట పూర్తికాక మునుపే డా గుప్తా లేచి తలుపువేపు గబగబా అడుగులు వేయసాగారు.

అందరూ దిగ్భ్రమంతో ఆయనవేపు చూడసాగరు.

డా. శహ 'ఇదేమిటి, ఇంకా సభ పూర్తవనే లేదు. అలా వెళ్ళిపోతున్నారేమిటండి ?' అన్నారు.

డా. గుప్తా తలుపుదగ్గరున్న కోటు స్టాండు నుంచి తమ కోటు తీసుకుంటూ చిరునవ్వుతో,

'క్షమించాలి డా శహ. నాకిపుడు అత్యవసరమైన పనిఉంది. ప్రతి ఒక్క క్షణంకూడా నాకు అమూల్యమైనది. కాని మీ అందరికీ ధన్యవాదాలు చెప్పకుండా వెళ్లలేను. నా రోగిజబ్బేమిటో తర్కించి నాకు తెలిపిన మీ అందరికి నా హృదయపూర్వక అభివందనలు. నేను నా రోగికి పొరపాటుగా చికిత్స చేశానని చర్చించి నిర్ణయించినందుకు ధన్యవాదాలు. రెండు వారాలుగా నా చికిత్సలో దోషముందని పిస్తోందే కాని ఆ తప్పు ఎక్కడుందో గ్రహించలేక పోయాను. కాని ఈ సాయంత్రం మీరు నా కళ్లు తెరిపించారు'

టమేటోలు కొంచెం పండువి కోయడం ఆర్ట్—అందులో యూ పచ్చివి సలాడ్‌లో తినడానికి, మామూలు కత్తితో కంటే రంపం అంచుండే రొట్టె కత్తితో కోస్తే సులభంగా కోయబడతాయి. అంతే కాదు — అందంగా బిళ్లలుగా కోసుకోవచ్చు. టొమేటో బద్ద సిట్‌గా లేకపోతే బాగుండదు.

డా. గుప్తా తలుపు తెరుస్తూ 'నా రోగి చనిపోలేదు. ఇంకా బ్ర...తి...కే...ఉన్నాడు. ఆపరేషన్ చేసి అతన్ని కాపాడుకోవడానికి ఇదిగో ... వెడుతున్నా ... అభివందనలు' అంటూ డా. గుప్తా పరుగెడుతున్నట్టుగా అక్కడినుండి వెళ్లిపోయారు.

* * *

'తరువాతేం జరిగింది,' డా॥ ముఖర్జీ కథంతా విని ఆత్రుతతో అడిగాను నేను.

'ఇక జరిగేదేముంది? అరగంట తరువాత 'ఎక్స్‌క్లబ్' సభ్యులందరి ఎదుట డా. గుప్తా తమ పేషంటుకు ఆపరేషన్ చేసి అతని పేగులోనుండి చేప ఎముకను బయటికి తీశారు ఆ హరిజన యువకుని అదృష్టం చూడండి. ఏ రాజ మహారాజులకో లభ్యంకాని మహా మేధావులైన వైద్యుల సలహా, స్వయం—పర్యవేక్షణలు ఆ యువకునికి లభించాయంటే — దీన్ని అదృష్టం అనక మరే మనాలి ?' అంటూ డా. ముఖర్జీ ముగించారు. అప్పటికే చాలా ఆలస్యమయింది. గనుక ఆయన బయల్దేరడానికి లేచి నుంచున్నారు నేను ఆయనకు తోడుగా కొంతదూరం వెళ్లి వీడ్కోలు చెప్పి వచ్చాను.

ఇంటికివచ్చి పక్కమీద పడుకున్న నాకు వెంటనే నిద్రపట్టలేదు డా. ముఖర్జీగారి 'ఎక్స్‌క్లబ్' ఘటనలు నా కళ్లముందు మెదులుతున్నాయి. అలాగే మరోచిత్రం దృశ్యంకూడా నా కళ్లముందు నిలిచింది. అదో దారుణచిత్రం. వియత్నాంలో చైనా, పాక్ సరిహద్దుల్లో అరబ్, ఇజ్రైల్ రాష్ట్రాల సరిహద్దుల్లో జరిగిన దారుణ రక్తపాతాలు సైనికుల కష్టాలు, వేలకొలది నిరపరాధి ప్రజల చావులు ఇది బ్రతుకులోని రాక్షస మనోవృత్తి. మానవుని మరో ముఖం. ఆ చిత్రం మాసిపోయి దానిస్థానే మరో చిత్రం నా కళ్లెదుట నిలిచింది—ఆస్పత్రిలో హరిజన యువకుని ప్రాణాలను కాపాడటం కోసం ఎంతోమంది ప్రముఖ వైద్యులు శ్రద్ధాసక్తులతో, ఆశాదృక్కులతో పాటు పడుతున్న దృశ్యమది. భవిష్యత్తులో నమ్మకం కలిగించే, దైవిక మనోవృత్తి కలిగిన జీవితంలో మరో ముఖం!

అదీ జీవితమే!

ఇదీ జీవితమే!! ●